క్లుప్తంగా

నేడు కార్యకర్తల సమావేశం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ముఖ్య నాయకుల సమావేశం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ హాజరుకానున్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న బొలిశెట్టి భాస్కరమ్మ

పెన్‌పహాడ్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ సంఘం జిల్లా కన్వీనర్ బొలిశెట్టి భాస్కరమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేక తీవ్ర ఇబ్బందులు అవుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు విజయ, జయమ్మ, మంజుల, వజ్రమ్మ, సుజాత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన గునగంటి సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి మృతురాలి కుమారుడి స్నేహితులు సోమవారం రూ.12వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బిక్కి వెంకన్న, తొట్ల సుధాకర్, బిక్కి పరమేష్, పులుసు మహేష్, సామ శ్యాంసుందర్‌రెడ్డి, బిక్కి రమేష్, లింగయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మద్దిరాల : మండల కేంద్రంలో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన రాంపాక రామచంద్రు రోజూ మాదిరిగానే గేదెను మేతకు తీసుకెళ్లాడు. అయితే గేదె మేత మేసుకుంటూ తెగిపడిన విద్యుత్ వైర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందింది.

బిక్కుమళ్లలో ఎద్దు మృతి..

నూతనకల్ : మండల పరిధిలోని బిక్కుమళ్లలో సోమవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రామసాయం ఉపేందర్‌రెడ్డి తన ఎద్దులను మేతకోసం వదిలి పెట్టాడు. అయితే ఎద్దు వ్యవసాయ భూమిలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.


మరమ్మతు చేయించరూ..



ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లే దారి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో ముత్యాలమ్మ పండుగకు తగు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే మహిళలు బోనాలతో ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. ఈ దారి గుంతలమయమై వర్షపు నీటితో నిండి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పండుగకు ముందే దారి మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపైకి మురుగు.. ప్రజలకు ఇబ్బందులు



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని 1వ వార్డులో మురుగునీరు వీధుల్లోకి చేరి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెంది రోగాల పాలవుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మురుగు కాలువలు నిర్మించాలని, పూడిపోయిన డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

కోదాడ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు కోరారు. కోదాడలోని సుందరయ్య భవనలో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లోపించిందన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు.

వానాకాలం.. జాగ్రత్తలు ముఖ్యం



అనంతారంలోని మురుగు కాల్వ నుంచి చెత్తను తరలిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది (ఫైల్)



సింగారెడ్డిపాలెం వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది(ఫైల్)

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం పదిలం

పెన్‌పహాడ్ : వర్షా కాలంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈగలు, దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా, నీటి కాలుష్యం వల్ల కూడా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధుల నుంచి సురక్షితంగా ఉండవచ్చని పలువురు సూచిస్తున్నారు.

పరిశుభ్రతే ప్రధాన రక్షణ..

వర్షాకాలంలో మన చుట్టూ ఉన్న పరిసరాలను చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మనం సగానికి పైగా వ్యాధుల నుంచి బయటపడవచ్చు. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిలిచి, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరిగితే దోమలు విపరీతంగా వృద్ధి చెందుతాయి. దీనివల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి తీవ్రమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ వ్యాధులు మనిషిని కోలుకోకుండా చేసేంత ప్రమాదకరమైనవి.

పాటించాల్సిన జాగ్రత్తలు..

వర్షాకాలంలో చెరువులు, నదుల్లోకి కొత్త నీరు చేరి కలుషితమవుతుంది. కాబట్టి, తాగే నీటిని కాచి చల్లార్చి వడపోసి తాగడం ఉత్తమం. ప్రత్యామ్నాయంగా క్లోరినేషన్ చేసిన నీటిని తాగవచ్చు. అంతేకాకుండా నీరు ఎక్కువ కాలం నిలువ ఉండకుండా చూసుకోవాలి. ఇళ్లలోని కూలర్లలో నీటిని రోజూ పారబోసి శుభ్రం చేయాలి. అలాగే, నీటిని నిల్వ ఉంచే డ్రమ్ములను కూడా ప్రతిరోజూ ఖాళీ చేసి కొత్త నీటితో నింపుకోవాలి. పాత టైర్లు, కొబ్బరి బోండాలు, పగిలిన వస్తువుల్లో వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఇవి దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారతాయి. సాయంత్రం 6 గంటల లోపే ఇళ్ల తలుపులు, కిటికీలు మూసివేయడం వల్ల దోమలు లోపలికి రాకుండా నివారించవచ్చు. వీలైతే దోమ తెరలు వాడటం దోమ కాటు నుంచి రక్షణ కల్పిస్తుంది. వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ఈ సాధారణ జాగ్రత్తలు పాటించడం ద్వారా వర్షాకాలంలో వచ్చే అనేక వ్యాధుల నుంచి మనల్ని మనం, మన కుటుంబాన్ని కాపాడుకోవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

డ్రై డే నిర్వహిస్తున్నాం



వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. మురుగు కాల్వల్లో మురుగు తీయిస్తున్నాం. ప్రస్తుతం పంచాయతీల్లో నిధులు లేక పనులు కొంత వెనకబడినవి. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం.

– జానయ్య, ఎంపీడీఓ

పదకొండేళ్లుగా యోగా తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న యోగా గురువు, పాల్గొన్న యోగా సాధకులు

సూర్యాపేట : సూర్యాపేటలో గత 11 ఏళ్లుగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగా గురువు చాడ పాపిరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా కేంద్రం శిక్షణను ప్రారంభించి ఈ నెల 23వ తేదీకి 11 ఏళ్లు పూర్తవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా 23న ఉదయం 6 గంటలకు సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రంలో నిర్వహించే వార్షికోత్సవాలకు యోగా సాధకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యోగా సాధకులు వేల్పుల సుధాకర్, నల్లెడ సుదర్శన్ రెడ్డి, వల్కి లింగయ్య, మల్లారెడ్డి, గోరంట్ల శ్రీనివాస్, లింగయ్య, బాణాల శ్రీనివాస్, శ్రీనివాస రెడ్డి, జయలక్ష్మి, సుజాత, రజిత, కళావతి, విజయ, శ్రీనాథ్, చంద్రశేఖర్, రవీంద్రచారి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నూతనకల్ : ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించిందని ఆయన ఆరోపించారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి కార్పొరేట్ శక్తులను పోషించిందని తెలిపారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్ని, మనోజ్‌కుమార్, సాయి, విష్ణు పాల్గొన్నారు.

సంతోష్‌బాబు కుటుంబానికి సాయం



కల్నల్ సంతోష్‌బాబు తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సూర్యాపేట : దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్‌బాబు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని యోగా సిందూర్ ఫౌండర్ యోగా నారాయణ, ప్రెసిడెంట్ శివదుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం యోగా సిందూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్నల్ సంతోష్ బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తల్లిదండ్రులు ఉపేంద్ర, మంజులకు రూ.లక్ష చెక్కు అందజేసి మాట్లాడారు. యోగా సిందూర్ ద్వారా వచ్చిన రూ.3,31,570లను దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల కుటుంబాలకు అందజేస్తున్నామని తెలిపారు. మరో లక్ష రూపాయలు మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు అందజేస్తామని అన్నారు. కార్గిల్ దివస్ సందర్భంగా ఈ నెల 26న నల్లగొండలో జరిగే కార్యక్రమంలో కార్గిల్ యుద్ధవీరుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. యోగా సిందూర్ ద్వారా భవిష్యత్తులో అనేక సామాజిక, యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం సంతోష్ బాబు తల్లిదండ్రులు ఉపేంద్ర మంజులను, కార్గిల్ యుద్ధ వీరుడు గోపయ్య చారి సతీమణి శారదను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీర జవాన్ కుటుంబ సభ్యులు, యోగా గురువులు, విద్యుత్ శాఖ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్ రెడ్డి, కోటేశ్వరరావు, అనిల్ కుమార్, వెంగళరావు, ప్రవీణ్, అశోక్ కుమార్, రాము, శ్రీనివాసరావు, పాపిరెడ్డి, కంది భజరంగ్ ప్రసాద్, మమత, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నాగారం : పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఎమ్మెల్యే సామేల్ మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాలకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని ఫణిగిరిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల పనులు ప్రారంభం, పసునూర్‌లో పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన, నాగారం, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

రిటైర్డు ఉపాధ్యాయుడి ఉదారత్వం

- రహదారికి స్వచ్ఛందంగా మరమ్మతు చేయిస్తున్న జంగిలి ఉపేందర్‌రావు



రహదారిపై మొరం పోయిస్తున్న ఉపేందర్‌రావు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డు టీచర్ జంగిలి ఉపేందర్‌రావు సోమవారం తన సొంత ఖర్చులతో ఫణిగిరి నుంచి వర్ధమానుకోట ప్రధాన రహదారికి మరమ్మతు పనులు ప్రారంభించారు. రూ.లక్ష వ్యయంతో 150 ట్రిప్పుల మొరం పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫణిగిరి నుంచి వర్ధమానుకోటకు వెళ్లే రహదారి గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. దీంతో తన సొంత ఖర్చులతో 150 ట్రక్కుల మొరం పోయించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు రైతులు, యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గుంటకండ్ల అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, సరస్వతివెంకన్న, నాయకులు పెరమల్ల జాన్‌వెస్లీ, మామిడి కృష్ణ, కల్లెట్లపల్లి రాములు, సూరయ్య, తీగుళ్ల వెంకన్న, తీగుళ్ల సురేష్, రాంమూర్తి, బుక్కరాజు సోమయ్య, గట్టు రవి, ఎర్ర సాయిలు, బత్తుల రామలింగయ్య, యాకూబ్ అలీ, వల్లాల రామయ్య, వంగూరి అవిలయ్య, రైతులు పాల్గొన్నారు.

మహా గ్రామీణ మహోత్సవం



మహా గ్రామీణ మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రావుల దినేష్

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని ఖమ్మం ఎక్స్ రోడ్‌లో సోమవారం కాకతీయ టయోటా షోరూం ఆధ్వర్యంలో మహా గ్రామీణ మహోత్సవం నిర్వహించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రావుల దినేష్, కాంగ్రెస్ నాయకుడు నాగుల వాసులు ముఖ్య అతిథులుగా హాజరై ఈ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకతీయ టయోటా షోరూం సభ్యులు మాట్లాడుతూ సూర్యాపేటలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో మహా గ్రామీణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులపాటు అన్ని రకాల మోడల్ కార్లు పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ టయోటా షోరూం సిబ్బంది, బ్యాంకు, ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి



కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ యోగానంద్, నాయకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి, దేవస్థాన కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోములకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు డాక్టర్ యోగానంద్ గుండమరాజ్– డాక్టర్ సునీత గుండమరాజ్ దంపతులు అర్వపల్లి ఆలయం అభివృద్ధికి ముందుకు వచ్చారు. సుమారు రూ.10లక్షల వ్యయంతో ఆలయంలో కల్యాణమండపం నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా దాత, ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ యోగానంద్‌ను దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థాన డైరెక్టర్ జె.సోమయ్య, అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, ఎం.అవిలమల్లు, పెసర సతీష్‌రెడ్డి, కుంభం బన్ని, వల్లాల ఖాజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

సూర్యాపేట : కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్ట్ పార్టీకి తీరని లోటని సూర్యాపేట పట్టణ పరిధిలోని వాణిజ్యభవన్ శాఖ సీపీఎం కార్యదర్శి బొమ్మిడి లక్ష్మీనారాయణ తెలిపారు. కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి చెందిన సందర్భంగా సోమవారం వాణిజ్య భవన్ సెంటర్‌లోని సీపీఎం దిమ్మె వద్ద ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేవీపీఎస్ శిక్షణ తరగతులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 22, 23, 24 తేదీలలో జరిగే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల విజయవంతానికై సోమవారం అర్వపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేవీపీఎస్ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. కేంద్ర పాలకులు కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష పోరాట సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా..

- జాజిరెడ్డిగూడెం గ్రంథాలయంలో సౌకర్యాలు లేక పాఠకులకు ఇబ్బందులు
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు



అసంపూర్తిగా నిలిచిన భవనం పనులను పరిశీలిస్తున్న చైర్మన్ వంగవీటి రామారావు(ఫైల్)

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని గ్రంథాలయ భవన నిర్మాణ పనులు 17 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. గ్రంథాలయానికి 2009లో సొంత భవనాన్ని నిర్మించారు. అయితే కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పుడప్పుడు కొద్దికొద్దిగా పనులు జరుగుతున్నాయి. దీంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పథకాల నుంచి ఇప్పటివరకు సుమారు రూ.20 లక్షలకు పైగానే ఖర్చుచేశారు. అయినా ఇంకా అనేక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

నెల రోజుల్లో పూర్తయ్యేనా..

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు ఇటీవల తొలిసారిగా జాజిరెడ్డిగూడెం గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠకులు వివిధ సమస్యలను పరిష్కరించాలని జిల్లా చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన చైర్మన్ వెంటనే పనులను పూర్తిచేయించేందుకు ప్రతిపాదనలు తయారు చేయించారు. అసంపూర్తిగా మిగిలిన పనులను చేయించడంతోపాటు మరుగుదొడ్లు, కంటి గోడ, స్లాబ్ ఫ్లోరింగ్, నీటి వసతి ఏర్పాటు, ఫర్నిచర్, పుస్తకాలు మంజూరు తదితర సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ హామీ ప్రకారం సమస్యలను త్వరగా పరిష్కరించాలని జాజిరెడ్డిగూడెం గ్రామస్తులు, పాఠకులు కోరుతున్నారు.

సమస్యలను తెలియజేశాం



జాజిరెడ్డిగూడెం గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను, అసంపూర్తిగా నిలిచి పోయిన పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే ఆయన స్పందించి నెల రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు తీరితే ఇక్కడి గ్రంథాలయం మోడల్ లైబ్రరీగా మారనుంది.

- బింగి కృష్ణమూర్తి, పాఠకుడు

దారి ఇలా.. రాకపోకలు ఎలా?

- బీటీ రోడ్డుకు నోచుకోని వేల్పుచర్ల గ్రామ పంచాయతీ



బురద, గుంతలమయంగా మారిన రోడ్డు

అర్వపల్లి : మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామ పంచాయతీ ఇప్పటివరకు బీటీ రోడ్డుకు నోచుకోలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ దారి మరింతగా దెబ్బతిని, ప్రయాణాలకు తీవ్ర ఆటంకంగా మారింది. రహదారిపై వర్షపు నీటితో నిండిన గుంతల వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు.

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు..

ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు గతంలో ఐదు సార్లకు పైగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ, అవి ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. సంవత్సరాలు గడుస్తున్నా ఈ ప్రతిపాదనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల డిమాండ్..

ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వేల్పుచర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. మెరుగైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని, ప్రమాదాల బారిన పడకుండా తమను కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం



మా గ్రామ రోడ్డును బీటీగా మార్చేందుకు ఇప్పటికే అనేక సార్లు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం రోడ్డు మొత్తం గుంతలమయమై బురదమడుగులా మారింది. ఇప్పటికైనా ఈరోడ్డును బీటీగా మార్చాలి.

– చిక్కుల శేఖర్, గ్రామస్తుడు

పల్లె దవాఖానాలో కొరవడిన వసతులు



గది బయట కూర్చొని రిజిస్టర్లు రాస్తున్న సిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని పల్లె దవాఖానాకు పక్కా భవనం లేక తాత్కాలికంగా ఎస్సీ బాలికల వసతి గృహంలోని ఓ గదిలో ఆస్పత్రిని నడిపిస్తున్నారు. అయితే ఈ గదిలో ఫ్యాన్లు, లైట్లు కూడా సరిగా లేవు. దీంతో ఏమి కనిపించకపోవడం, ఉక్కపోతతో రోగులు, సిబ్బంది అవస్థల పాలవుతున్నారు. 8వేల జనాభా కలిగిన ఈ పల్లె దవాఖానాకు ప్రతిరోజు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. వచ్చిన వారికి కనీస వసతులు కొరవడటంతో ఇబ్బందులు పడుతున్నారు. గదిలో సరిగా వెలుతురు ఉండకపోవడంతో వైద్య సిబ్బంది రిజిస్టర్లను ఆరుబయట కూర్చొని రాసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాగా ఇక్కడ పల్లె దవాఖానా భవన నిర్మాణానికి ఇటీవల రూ.20 లక్షలు మంజూరయ్యాయి. భవనం నిర్మించి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాలలో ప్రమాదకరంగా గుంతలు



భజనాతండా ప్రాథమిక పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న గుంత

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని భజనాతండా ప్రాథమిక పాఠశాలలో పిల్లర్ గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ పాఠశాలలో గతంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పనుల్లో భాగంగా గుంతలు తీశారు. కానీ కాంట్రాక్టర్ ఆ పనులను ప్రారంభ దశలోనే ఆపివేశారు. పైగా తీసిన పిల్లర్ గుంతలను కూడా పూడ్చివేయకుండా నిర్లక్ష్యంగా అలాగే వదిలేశారు. దీంతో పాఠశాల ఆవరణలో స్థలం లేక విద్యార్థులు చదువుకునేందుకు, ఆటలు ఆడేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా గుంతలు ప్రమాదకరంగా మారాయి. పిల్లలు ఆడుకునే సమయంలో గుంతల్లో పడే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వెంటనే గుంతలను పూడ్చి స్థలాన్ని చదును చేయించాలని కోరుతున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం ఎస్‌ఐ గంధమళ్ల అజయ్‌కుమార్ అన్నారు. సైబర్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట జిల్లా పోలీస్ వ్యవస్థ సైబర్ నేరాల నియంత్రణపై నిఘా పెట్టిందన్నారు. స్కూళ్లు కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దని సూచించారు. అనంతరం పలువురు పోలీస్ కళాకారులు పలు సామాజిక కార్యక్రమాలపై ఆటాపాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాణి, కోదాడ షీటీమ్ మహిళా కానిస్టేబల్ జ్యోతి, పోలీస్ సిబ్బంది నరేష్, కళ్యాణ్, గోపి, పోలీసు కళాజాత బృందం ఇన్‌చార్జి యల్లయ్య, గోపయ్య, చారి, విద్యార్థులు పాల్గొన్నారు.